కథానిక

"కూలిపోయిన ఇళ్ళు...
నీళ్ళ అంచున గుడిసెలు...
మానవత్వం లేని
పెద్ద మనుషులు..."

# మనసు మీది తుఫాను



అప్పుడప్పుడే తెల్లారుతుంది.

అందరూ ఆదమరచిన వేళ... సర్వమూ దోచుకున్న దొంగలా.. సంతృప్తిగా, బరువుగా అడుగులేస్తూ నిశ్శబ్దంగా నిష్క్రమిస్తోంది చీకటి.

గుండెను దిటవు చేసుకుంటూ ఇంట్లోంచి బయటకొచ్చాడు శ్రీనివాస్. మసక మసకగా వున్న ఆ చిరు వెలుతురులోకి చూపులు జొప్పిస్తూ ఆవరణంతా కలియజూసుకున్నాడు.

ఏదీ స్పష్టంగా కనబడకపోయినా అంతా స్పష్టంగానే అర్థమవుతూనే ఉంది. అర్ధరాత్రి భీభత్సం సృష్టించిన తుఫాను పచ్చని జీవితాలమీద దొంగ దెబ్బ తీసింది. పరిమళించే సుందర స్వప్నాలని ముక్క చెక్కలుగా విరిచేసింది.

విశాలమైన పెరడులోంచి నింగికెగసి ఆకాశంతో నేస్తం కట్టినట్టుండే పాతిక కొబ్బరి చెట్లలో ఏ ఒక్కటి నిలబడి లేదు. ఏ చెట్టుకీ వేళ్ళు భూమిలో లేవు.

పందిరిలా ఆకాశాన్ని అల్లుకుపోయి, అమ్మలా చల్లదనాన్నిచ్చే తాతల తరం నాటి రావి చెట్టు కూకటి వేళ్ళతో పెళ్ళగించబడి తలని నేలకి వాల్చేసింది.

చిరకాల ఆప్త మిత్రుణ్ణి కోల్పోయినప్పటిలా బాధ అతని మనసుని కమ్మేసింది. బరువుగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. చావు భయంతో రాత్రంతా గడిపిన ఇల్లంతా కలియజూశాడు.

ఎనిమిది గదులన్న డాబా ఇల్లది. తలుపులన్నీ మూసివున్న ఇంట్లో ప్రతి గదిలోనూ మడమలు మునిగేంత నీరు నిలిచి ఉంది. పరుపులు, మంచాలతో సహా తడవని వస్తువంటూ ఏదీ లేదు.

పెను తుఫాను పేరుతో అర్ధరాత్రి వాయుదేవుడు మొరటు బలంతో చేసిన విచ్చలవిడి విరహానికి వరుణుడు పిచ్చిపట్టిన రాక్షసుడిలా జనమ్మీద దాడి చేసిన జాడలవి.

"ఈ డాబా ఇల్లే ఇలా ఉంది. ఊరెలా ఉందో.. తోటలెలా ఉన్నాయో.." అనుకుంటూ బయట పడ్డాడు శ్రీనివాస్.

కుటుంబ సభ్యులందరిని కోల్పోయిన పసివాడిలా కోనసీమలోని ఆ పల్లె బిక్కచచ్చి ఉంది.

అభయమిస్తున్నట్టు తెల్లని వెలుగు ఊరిమీద వాలినా జనం ఇంకా ధైర్యం కూడగట్టుకునే స్థితికి కూడా రాలేదు.

తన ఇరవై రెండేళ్ళ వయస్సులో ఎప్పుడూ ఎరగని భీభత్సం ఇది. స్నేహితులను కలుపుకుని ఊరంతా తిరిగి చూశాడు శ్రీను.

కూలిపోయిన ఇళ్లూ, గోడలకింద, దూలాల కిందా పడి ఊపిరొదిలిన జీవాలూ, కూలిపోయిన ఆస్తులూ, నేలవాలిన తోటలూ. ..

దుఃఖం.. దుఃఖం.. ప్రకృతి చేసిన ధ్వంస రచనకు దుఃఖం అక్కడ ఏరులై పారుతున్నట్లుంది.

కర్తవ్యం గుర్తుకొచ్చిన ఉడుకు నెత్తురుని మానవీయత వెన్ను చరిచింది! కరిగిన హృదయాలను పెనవేసుకుని, చేయిచేయి కలిపారు మిత్రులు.

స్వంత బాధల్ని మరిచారు.

శిధిలాల కింద శవాలను కదిలించారు. కలిగిన కుటుంబాలనుంచి బియ్యం, పప్పు సేకరించి ఒండి పెట్టి ఒదార్చారు. ఆ ఊళ్ళో, చుట్టు పక్కల సర్వం కోల్పోయిన వాళ్ళకి కన్నీటి బొట్టులా తోడై నిలిచారు.

మూడు రోజులు గడిచిపోయాయి. ప్రభుత్వం అందిస్తున్న సాయం అందరికీ అందడంలేదని పత్రికలు హోరెత్తుతున్నాయి. ఆపదలో వారిని ఆదుకోవడం కోసం ఎక్కడెక్కడినుంచో స్వచ్ఛందంగా జనం సరుకులతో తరలి వస్తున్నారు.

శ్రీనివాస్ బృందానికి శ్రమ తప్పింది. సహాయం అందరికీ అందేలా చూసుకుంటూ... విషయాల

రావులపల్లి సునీత

తెలుసుకుంటున్నప్పుడు వినబడింది. తిప్పలపల్లి గ్రామం ఎక్కడో సముద్రపాయల్లో ఉంది. ఇంత వరకూ ఆ ఊరు వెళ్ళినవాళ్ళు లేరు. దారులు లేవని.

వెంటనే అయిదువందల మందికి పులిహోర వండుకుని మంచినీళ్ళు క్యానులతో నింపుకుని పడవల్లో ప్రయాణమయ్యారు.

ఒండ్రులో కూరుకుపోయి పడవలు కదలలేని చోట బురదలో దిగి తోసుకుంటూ, తుప్పల్లో శవాలను తప్పించుకుని తెడ్లు వేసుకుంటూ వెళ్ళగలిగినంత దూరం వెళ్ళారు. ఇహజలమార్గం అసాధ్యమనుకున్నచోట పడవని వదిలేసి ఆహారపు సంచులు నీళ్ళు వీపుమీద మోస్తూ బురదలో నాలుగు కిలోమీటర్లు నడిస్తే తిప్పనపల్లి వచ్చింది.

శవాలు కుళ్ళిన కంపు వాళ్ళకు ఆహ్వానం పలికింది.

కేవలం జాలర్లు నివసించే ఓ మోస్తరు పెద్ద ఊరది. కూలిపోయిన ఇళ్ళూ, సగం..సగం.. కొట్టుకుపోయి నీళ్ళ అంచున ఆగిపోయిన గుడిసెలూ... శిధిలాల మధ్య కొద్దిపాటి ఇళ్ళూ మాత్రమే మిగిలి వున్నాయి.

బయట ఎక్కడా మనుషుల అలికిడి లేదు. ఆ పక్కనే వున్న సముద్రం మాత్రం కడుపునిండా మానవ శరీరాన్ని మింగి, విశ్రాంతిగా పడుకున్న కొండచిలువలా అమాయకంగా వుంది.

అందరూ సముద్రంలో కొట్టుకు పోలేదు కదా! అనిపించిందో క్షణం శ్రీనువాళ్ళకు. గుడెసె దాకా వెళ్ళి తొంగి చూడ్డానికి కూడా జంకు కలిగింది.

పడిపోకుండా వున్న ఇళ్ళకు దగ్గర్లో నిలబడి వీపుమీద బరువులన్నీ కిందకు దించారు.

"ఇళ్ళలో వాళ్ళంతా బయటకు రండి! మీకోసం భోజనం నీళ్ళు తెచ్చాం!" అంటూ పెద్దగా అరవడం మొదలు పెట్టారు.

గుడిశల్లో సన్నని కదలిక మొదలైంది. ముందుగా కొందరు పిల్లలు బయటకు వచ్చారు. ఆతర్వాత కొందరు పెద్దలు అడుగులో అడుగేసుకుంటూ సత్తువలేని నడకతో వచ్చి నిలబడ్డారు.

"మీకోసం పులిహోర, తాగే నీళ్ళు తెచ్చాం. తీసుకుని తినండి" అన్నారు యువకులు వాళ్ళని జాలిగా చూస్తూ.

నిర్జీవంగా వున్న వాళ్ళ మొహాల్లో ఏ భావమూ లేదు. కళ్ళూ, మొహం పీక్కుపోయి.. చూడగానే అర్థం అవుతుంది వాళ్ళ పరిస్థితి.

"ముందు కాసిని మంచినీళ్ళు తాగండి" చేతిలో నీళ్ళ క్యాను అందించబోయాడు శ్రీను.

వాళ్ళు అందుకోలేదు.

"మావూరు సగంమందిని గంగమ్మ పొట్టనబెట్టుకుంది" గొంతు పెగల్చుకొని అన్నాడు వాళ్ళలో ఒకతను.

"అయ్యయ్యో" సానుభూతిగా అన్నారు వీళ్ళు.

"మేం కూడు తిని నీళ్ళు తాగి ఇయ్యాల్టికి నాల్రోజులు" మళ్ళీ అన్నాడతను. మాట వినబడుతోంది గాని, మొహంలో ఏభావమూ లేదు.

కానీ, అతని గొంతులో మాత్రం కోపమో.. అసహాయతో.. బాధో తెలియని అస్పష్ట భావన.

"అందుకేగా మీకోసం భోజనం తెచ్చాం. ఈ బస్తాల్లో పులిహోర ప్యాకెట్లున్నాయి, తీసుకుని అందరూ పంచుకు తినండి" అన్నాడో యువకుడు.

పిల్లలు ఆహారపు సంచుల వైపు ఆశగా చూశారు.

యువకులు తాము తెచ్చిన సంచుల మూతులు విప్పారు. ఇసుక మీద ఓ గుడ్డ పరిచి, పులిహోర ప్యాకెట్లు కుప్పగా కుమ్మరించారు.

ఈ లోపల ఇంకొందరు బయటకు వచ్చి చుట్టూ మూగారు.

గుడ్డమీద పోసిన ఆహార పొట్లాలవైపూ, అవి తెచ్చిన యువకుల వైపు ఎగాదిగా చూస్తున్నారు వాళ్ళంతా. కళ్ళల్లో ప్రాణాలు నిలువుకొని చూస్తున్న వాళ్ళ చూపుల్లోని భావమేమిటో శ్రీను వాళ్ళకేమీ అర్థం కాలేదు.

"ఎన్ని పొట్లాలు తెచ్చారు?" ముందుగా వచ్చి

> "దుఃఖం, దుఃఖం
> ప్రకృతి చేసిన ధ్వంస రచనకు
> దుఃఖం అక్కడ ఏరులై
> పారుతుంది!"

మాట్లాడినతను ప్రశ్నించాడు. ప్రశ్న కాస్త కటువుగా వుంది.

"అయిదొందలు" చెప్పాడు శ్రీను. క్షణం నిశ్శబ్దం!

"లం...కొడకల్లారా...!" పళ్ళు పటపటా కొరుకుతూ అరిచాడతను.

నెత్తుటి జీరలు చిట్లిపోయినట్టు అతని కళ్ళూ మొహమూ కంది పోతున్నది.

"నాలుగు రోజులనుండి మా మొహం చూసినవాడు లేడురా" కొండరాయి బద్దలవుతున్నంత కోపంతో మళ్ళీ అరిచాడతను.

అంతే అందరూ కూడబలుక్కున్నట్టు అరుపులు మొదలు పెట్టారు.

"కడుపులో మెతుకుల్లేక అల్లల్లాడతండాంరా..!"

"అయిదొందలమందికి తెత్తారా భోజనాలు! మీ కడుపుకొట్ట!"

"అయిదొందలమంది తింటావుంటే మిగితావోల్లేమయిపోవాల?"

"సగంమందికి కూడా సాలవీ బిచ్చం మెతుకులు"

"సచ్చినోళ్ళంతోపాటే చావనన్నా చచ్చినోళ్ళం కాదు. మాకు సగమ్మందికన్నా సరిపోతాయంట్రా ఇయ్యి!"

"నువ్వు తెచ్చిన నాలుగు మెతుకులకోసం మాలో మేం పీక్కుని, కొట్టుకుని సావాలంట్రా లం... కొడకల్లారా.. కొట్టక సత్తావుంటే సూద్దామని వచ్చార్రా...?

"ఈ చణం దాకా అందరం సావుతో పోరాడి బతికినోళ్ళవే...! ఈ తిండితో సగంమందిని బతికేం సెయ్యాల?- మిగితా సగం మంది సత్తంటే సూత్తా కూకుని ఏడవడానికా మేం బతకాల?"

"అందరం కలిసి ఎట్టా బయట పడ్డావో... అట్టాగే అందరం కలిసే సత్తాంగా... నీ బోడి మెతుకుల కోసం ... పెద్ద సేపలు సిన్న సేపల్ని మింగినట్టు మేమూ పశువులమై పోతామ్రా...!"

"అరె సూత్తారేంట్రా సముద్రంలో పారేయండ్రా ఆ మాయదారి తిండి!"

అరుపులు, కేకలు, తిట్లు, అయోమయం!

అక్కడేం జరుగుతుందో అర్థమయ్యే లోపలే ఆహారం సముద్రం పాలయ్యింది.

ఆకలి కడుపులకు ఆశపెట్టి, భగ్నం చేసినందుకు కాబోలు కసితో, కోపంతో కొందరు శ్రీను బృందమ్మీదకి కొట్టడానికి ఎగబడ్డారు.

వాళ్ళ దెబ్బలనుండి తప్పించుకోవడానికి పరుగులే పరుగులు! ఊరుచేరేవరకు ఎవ్వరి నోటా మాట రానంత షాక్!

నాలుగు రోజులుగా సేవలందించిన ఆ యువకులకు ఊహించని పరిణామమిది.

మృత్యువుతో పోరాడి బయటపడి, ఆప్తుల్ని పోగొట్టుకుని, ఆస్తులు కొట్టుకుపోయి, ఆదరించే మనిషి కనబడక.., ఆకలితో... చావు భయంతో, దిక్కులేని పక్షుల్లా కుంచించుకుపోయిన ఆ మనుషులు...

ఆహారం కనబడగానే ఎవరికి దొరికింది వాళ్ళు పీక్కుతిని బతికి పోదామని అనుకోవల్సిన పరిస్థితిలో వున్న ఆ మనుషులు...

అందుకు భిన్నంగా... ఆకలి చావో... అన్నమో... అందరూ ఐక్యంగా ఏదో ఒకటి మాత్రమే పంచుకోవాలనుకోవడం...

అన్నం సాధ్యం కాదు గనుక ఐక్యంగా ఆకలి చావునే ఎన్నుకున్న ఆ పెద్ద మనుషులు... పెద్ద మమషులు... యువకుల 'మనసు'ల మీద పెద్ద తుఫానే సృష్టించారు.

అప్పటి వరకూ.. గొప్ప సహాయం అందిస్తున్నామని తమ గురించి తాము గొప్పగా సంతృప్తి పడిన ఆ మిత్రులకు... ఆ జాలరుల ముందు తామెంతో చిన్నవాళ్ళుగా అనిపించారు!